



విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది



టీకా వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

పెండింగ్ ఫైల్స్ పరిష్కరించండి

» కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ ఫైల్స్ త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. మొత్తం 52 ఫిర్యాదులను స్వీకరించగా అందులో 45 రెవెన్యూ 7 ఇతర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, అధికారులు పాల్గొన్నారు.

సంచార టీకా వాహనాల ప్రారంభం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు సంచార టీకా వాహనాలను కలెక్టర్ నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ ద్విచక్ర వాహనాలలో పట్టణ, మారుమూల బస్తీలు, మురికివాడల్లో తిరిగి పిల్లలకు, గర్భిణులకు టీకాలు ఇవ్వనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ షీబా, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాకేష్ పాల్గొన్నారు.

ఐదేళ్లుగా తిరుగుతున్నా.. కొత్త పాస్‌బుక్ ఇవ్వడం లేదు



రోదిస్తున్న తోపుగొండ రాములమ్మ

ఐదేళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా కొత్త పాసుబుక్ ఇవ్వడం లేదని చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన తోపుగొండ రాములమ్మ కలెక్టరేట్‌లో కన్నీరుమున్నీరయ్యారు. 1996లో ప్రభుత్వం గ్రామంలోని సర్వే నెంబర్ 185లో మూడు ఎకరాల అసైన్డ్ భూమి ఇచ్చిందని ఆమె తెలిపారు. అప్పట్లో అధికారులు పాస్ బుక్ కూడ ఇచ్చారని, ధరణి వచ్చాక కొత్త పాసుబుక్ కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నానని వాపోయింది. కలెక్టరేట్‌కు వెళ్తే.. తహసీల్దారు వద్దకు వెళ్లమంటున్నారు. తహసీల్దారు వద్దకు వెళితే కలెక్టరేట్‌కు పొమ్మంటున్నారు. ఇలా 2019 నుంచి తిప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిస్తే అదనపు కలెక్టర్‌కు ఫార్వర్డ్ చేశారని, ఆమె కూడా పట్టించుకోవడం లేదన్నారు. కలెక్టర్ చెబుదామని వెళ్తుంటే అడ్డుకుంటున్నారని బోరుమంది.

సర్కారు బడుల్లో కిచెన్ షెడ్లు లేక మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పథకం ప్రారంభించి ఏడేళ్లవుతున్నా చాలా పాఠశాలల్లో ఇప్పటివరకు వంట గదులు నిర్మించలేదు. కిచెన్ షెడ్లు లేక ఆరుబయట చెట్ల కింద దుమ్ము ధూళిలో వంట చేస్తూ నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. వానొస్తే వరండాలు, తరగతి గదులే దిక్కు. కిచెన్ షెడ్లు మంజూరైనా నిర్మాణాలు పూర్తి చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు.



కీసర ఉన్నత పాఠశాలలో ఆరుబయటే వంట చేస్తున్న నిర్వాహకులు

వంట.. ఎన్నాళ్లీ తంటా!

- ఆరుబయటే మధ్యాహ్న భోజనం వంట
- వానొస్తే వరండాలు, తరగతి గదుల్లో వంటావార్పు
- కిచెన్ షెడ్లు మంజూరైనా నిర్మాణానికి నోచని వైనం
- బియ్యం, కూరగాయలు భద్రపరచడానికి అవస్థలు

కిచెన్ షెడ్లు మంజూరు	రూరల్	అర్బన్	మొత్తం
	287	86	373

రంగారెడ్డి జిల్లాలో నిర్మాణ వివరాలు

గ్రౌండ్ లెవల్ : 14, బేస్‌మెంట్ స్థాయి : 5
లెంట్ లెవల్ : 24, స్లాబ్ స్థాయి : 15
నిర్మాణం పూర్తయినవి : 45
పనులు ప్రారంభించనివి : 184

ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్ల కొరత

రంగారెడ్డి అర్బన్/వికారాబాద్, నవంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కిచెన్ షెడ్లు లేని కారణంగా మధ్యాహ్న భోజనం వండటానికి నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అనేక పాఠశాలల్లో ఆరు బయటే వంటావార్పు చేస్తున్నారు. చెట్లకింద దుమ్ముధూళిలో వంట చేస్తూ మహిళలు పడే అవస్థలు వర్ణనాతీతం. ఇక వానొస్తే వరండాలు, క్లాస్ రూములే దిక్కు. బడుల్లో గ్యాస్‌సిలిండర్లు అందుబాటులో లేక ఆరుబయట కట్టెల పొయ్యి మీదే వంట చేస్తున్నారు. దీంతో తరగతి గదుల్లోకి పొగ వెళ్లి విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలకు కిచెన్ షెడ్లు మంజూరు చేసింది. కానీ.. అధికారుల అలసత్వంతో చాలావరకు నిర్మాణాలు అర్థంతరంగా నిలిచిపోయాయి. దీంతో వంట చేసేందుకు నిర్వాహకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైనా

మిగతా 7వ పేజీలో...

వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్ జిల్లా పూడూరు, దోమ, తాండూరు మండలం మల్కాపూర్, పెద్దేముల్ ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదులు లేకపోవడంతో తరగతి గది వరండాలో వంటలు చేస్తున్నారు. తక్కువ విద్యార్థులు ఉన్నచోట, గిరిజన తండాలలో, ఇళ్లలో భోజనాన్ని వండి పాఠశాలకు తీసుకువచ్చి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. దౌల్తాబాద్‌లో కిచెన్ షెడ్డు లేని కారణంగా పురాతన షెడ్డులో వంటావార్పు చేస్తున్నారు. బషీరాబాద్‌లో 15 ఏళ్ల క్రితం చేపట్టిన కిచెన్ షెడ్డు నిర్మాణం ఇప్పటి వరకు పూర్తి కాలేదు.

పనిభారం తగ్గించాలి

శంషాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పనిభారం తగ్గించాలని ఆర్టీజియన్ సిబ్బంది సోమవారం శంషాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ఒర్నా చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంషాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర పనులు నిర్వర్తించే ఆర్టీజియన్ శాఖకు చెందిన ఉద్యోగి ఎండీ. గౌస్ ఆదివారం మరమ్మతు పనులకు వెళ్లి గాయపడ్డాడని, పని ఒత్తిడి కారణంగానే ఇలా ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. గౌస్ గాయపడినా యాజమాన్యం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై సబ్‌స్టేషన్ ఏఈ బాషను వివరణ కోరగా.. గాయపడిన ఎండీ. గౌస్‌కు మెరుగైన చికిత్స చేయిస్తామని తెలిపారు. పట్టించుకోవం లేదని ఆర్టీజియన్ సిబ్బంది ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు.

నిబంధనలు పాటించాలి

చేవెళ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్ పాటించాలని రిటైర్డ్ జడ్జి సాంబశివుడు, రాజేంద్రనగర్ ఏసీపీ బాలాజీ నాయక్ తెలిపారు. సోమవారం చేవెళ్ల కోర్టులో ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న కేసులపై లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... డ్రంక్‌అండ్ డ్రైవ్ 66 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. కేసుల పరిష్కరంకు గాను జరిమానా ద్వారా రూ. 1.34000 విధించారు. మద్యంతాగి డ్రైవ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ట్రాఫిక్ పోలీస్‌లు తదితరులు ఉన్నారు.



ఇబ్రహీంపట్నంలో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదిత స్థలం

కలగానే మినీ స్టేడియం

హామీలకే పరిమితమైన నిర్మాణం

- మైదానాలు లేక అవస్థల్లో క్రీడాకారులు
- వెంచర్లు, ఖాళీ వ్యవసాయ క్షేత్రాల్లో సాధన
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఇబ్రహీంపట్నంలో మినీ స్టేడియం కూడా లేదు. ఈ ప్రాంతంలో అనేక అంతర్జాతీయ పరిశ్రమలు ఏర్పాటవుతున్నప్పటికీ క్రీడాకారులు సాధన చేసుకోవడానికి సరైన మైదానం లేకపోవడం శోచనీయం. ఇక్కడ 20 వరకు ఇంజినీరింగ్, పీజీ కళాశాలలు ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పరిధిలోని అనేక గ్రామాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులున్నారు. సాధన చేయడానికి సదుపాయాలు లేక వారి ప్రతిభ మరుగున పడిపోతుంది. అలాగే పోలీస్ శాఖ, రక్షణ దళాల్లో చేరడానికి యువతకు ఆసక్తి ఉన్నా ప్రాక్టీస్ చేయడానికి వసతులు లేక ఉద్యోగాలు సాధించలేకపోతున్నారు. ఇబ్రహీంపట్నంలో వాకింగ్ ట్రాక్‌లు లేక రోడ్లపై పరుగెత్తాల్సిన పరిస్థితి నెలకొంది. పాలకులు మారుతున్నా స్టేడియం నిర్మాణం

మిగతా 8వ పేజీలో...



అవకాశాలు చేజారుతున్నాయి

గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతకు క్రీడలపట్ల ఆసక్తి ఉన్నా శిక్షణ పొందేందుకు మైదానం లేక అవకాశాలు చేజారుతున్నాయి. ఇబ్రహీంపట్నంలో స్టేడియం అందుబాటులో ఉంటే యువత సాధనకు ఉపయోగపడి ఉద్యోగాలు పొందే అవకాశముంటుంది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ పీఈటీ, పీడీలను నియమించాలి.

- డి.శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్, గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్ ఇబ్రహీంపట్నం



16 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆమనగల్లులోని శ్రీ వెంకటగిరి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి జనవరి 14వ తేది వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త గూడ కృష్ణమాచార్యులు తెలిపారు. వేడుకల్లో భాగంగా ప్రతీ రోజు ఉదయం ఐదు గంటలకు ప్రత్యేక పూజలు, తులసీ దళ అర్చన, వేద పఠనం, బాలబోగ నివేదన, నక్షత్ర హారతి, దర్శనం కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా జనవరి 14న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని చెప్పారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, అప్పటి వరకు మినిమమ్ టైమ్ స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.20 లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షలు కల్పించాలని, పదవీ విరమణ చేస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులకు బెనిఫిట్స్ కింద రూ. 25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, విద్యాశాఖల నియమకాల్లో వెయిటేజీ కల్పించాలని, పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని కోరారు. ధర్నాలో తెలంగాణ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, గౌరవ అధ్యక్షుడు బుచ్చప్ప, మహిళా అధ్యక్షురాలు శ్రీలత, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, కోశాధికారి సాయి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు

ఆలయ భూముల సర్వే



కొందుర్గులో ఆలయ భూములను సర్వే చేస్తున్న అధికారులు

చౌదరిగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొందుర్గులో శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని గ్రామస్తులు దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సోమవారం రెవెన్యూ అధికారులు ఆలయ భూముల సర్వే చేసి హద్దులు పాతారు. కొందుర్గు పడమట శివారులోని సర్వే నంబరు 11లో 14ఎకరాల 30గుంటలు, 15 సర్వే నంబరులో 13ఎకరాల 37గుంటల ఆలయ భూమి ఉంది. అయితే వీటిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఆలయ కమిటీ సమక్షంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ ఆలయ భూములను కబ్జా కాకుండా గ్రామస్థుల సహకారంతో ధర్మకర్తల మండలి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్‌శర్మ, సర్వేయర్ ఆంజనేయులు, పూజారి భరత్, వేణుగోపాల్, మధు, నరేందర్, యాదయ్య, నర్సింహులు, కిరణ్ పాల్గొన్నారు.

కాలుష్యం బారి నుంచి కాపాడండి

షాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చందన్‌వెల్లి పారిశ్రామిక హబ్‌గా మారుతుందని, పరిశ్రమలతో అభివృద్ధి చెందుతుందని సంతోషించాం కానీ, వాయుకాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నామని చందన్‌వెల్లి, హైతాబాద్, మాచన్‌పల్లి వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. చందన్‌వెల్లిలోని కుందన్ టెక్స్‌టైల్స్‌తో వాయు, జల కాలుష్యం ఎక్కువవుతోందని గ్రామస్తులు సోమవారం కంపెనీ ఈసీవో సుధాకర్‌కు కంపెనీ పరిసరాలను చూపించారు. కాంగ్రెస్ నాయకుడు చేవెళ్ల స్వామి మాట్లాడుతూ.. కుందన్ టెక్స్‌టైల్స్ నుంచి వెలువడే కాలుష్యంతో పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సంబంధ వ్యాధులకు గురవుతున్నారని తెలిపారు. పొలాల్లో పంట దిగుబడి తగ్గిపోయిందన్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలుష్య కోరల నుంచి గ్రామాలను కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రామచందర్‌రావు, గోపాల్, కిష్టయ్య, నరహరి, వెంకటయ్య, విఠల్‌రెడ్డి, రాజమల్లు, సత్తయ్య, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



కంపెనీ పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న గ్రామస్తులు

ఉల్లి తగ్గదు.. వెల్లుల్లి దిగదు

- వెల్లుల్లి కిలో ధర రూ. 400
- ఉల్లి ధర రూ.50పైమాటే



తాండూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఈ రెండు లేకుంటే వంటలు రుచికరంగా ఉండవు. అన్ని కూరల్లో, అన్ని రకాల వంటల్లో వాడే ఉల్లిగడ్డ, వెల్లుల్లి (ఎల్లిగడ్డ) ధరలు ప్రస్తుతం మార్కెట్‌లో అమాంతం పెరిగాయి. ధరలు చూసి ఎలా కొనుగోలు చేయాలంటూ సామాన్యులు వాపోతున్నారు.

తగ్గని ఉల్లి ధర..

కొన్ని నెలలుగా ఉల్లి ధర తగ్గడంలేదు. రిటైల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50పైమాటే. సాధారణంగా వర్షాకాలం ఎక్కువ ధర ఉండే ఉల్లి ప్రస్తుతం శీతాకాలంలోనూ ధర తగ్గుముఖం పట్టడంలేదు. ధర తగ్గాక కొనుగోలు చేద్దామనుకుంటున్న వారికి నిరాశే మిగులుతోంది. గత్యంతరం లేక తక్కువ మోతాదులో ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. నవంబరు నెలలో సాధారణంగా కిలో ఉల్లి ధర రూ.15 నుంచి రూ.20గా ఉంది. అయితే ప్రస్తుతం రెండింతలు పెరిగింది. గడిచిన ఆరునెలలుగా ఉల్లి ధర పెరుగుతూనే ఉంది. సాధారణ పౌరుడు కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఉల్లిధర కన్నీళ్లు తెప్పిస్తోంది.

వెల్లుల్లిదీ అదేదారి..

వెల్లుల్లి (ఎల్లిగడ్డ) సంగతి చెప్పనక్కర్లేదు. సామాన్యుడు కొనుగోలు చేయలేని స్థాయికి ధర పెరిగిపోయింది. ప్రస్తుతం మార్కెట్‌లో వెల్లుల్లి కిలో.400 పలుకుతోంది. పావుకేజీ రూ.100 ఉంది. స్థానికంగా పండించక పోవడం, దిగుమతిపై ఆధారపడటమే ధరలు తగ్గకపోవడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. తాండూరు మార్కెట్‌కు ఉల్లిగడ్డ మహారాష్ట్ర నుంచి, వెల్లుల్లి గుజరాత్ నుంచి దిగుమతి అవుతుంది. దీంతో ధరలపై ప్రభావం చూపుతోంది.

రావులపల్లి మాజీ సర్పంచ్‌కు అవార్డు



చేవెళ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధి రావులపల్లి మాజీ సర్పంచ్ కేసారం శ్రీనివాస్‌కు బహుజన సాహిత్య అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డు ప్రకటించింది. సోమవారం హైదరాబాద్‌లో బహుజన సాహిత్య అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ ప్రశంసా ప్రత్రాన్ని శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ నెల 15న ఢిల్లీలో జరిగే 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో శ్రీనివాస్‌కు అవార్డు అందుకుంటారని చెప్పారు.

రైల్వే వంతెనపై డ్రామాలు మానుకోవాలి



ఘట్‌కేసర్‌లో రైల్వే వంతెన వద్ద పర్యటిస్తున్న సుధీర్‌రెడ్డి, వజ్రేష్ యాదవ్

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ రైల్వేవంతెన నిర్మాణం విషయంలో కొందరు నాయకులు డ్రామాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. వారు ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణ పనులను సోమవారం పరిశీలించారు. అనంతరం కాంట్రాక్టర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి మంత్రిగా పనిచేసి ఎక్కడి పనులను అక్కడే వదిలేసి చోద్యం చూసిన స్థానిక ఎమ్మెల్యే తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చి కేవలం ఏడాదే అవుతున్నదన్నారు. ఏప్రిల్ వరకు వంతెన నిర్మాణ పనులను పూర్తి చేస్తానని కాంట్రాక్టర్ హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. ఇంతలోనే కొందరు దీక్షపేరుతో డ్రామాలకు దిగడం విడ్డూరంగా ఉందన్నారు. నాలుగు నెలల్లో పూర్తి చేసేందుకు అన్నిచర్యలు చేపట్టినట్లు వివరించారు. దీక్షల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో కాని పనులు కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేయాలనడం రాజకీయ అక్కసు కాదా? అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రజలను రెచ్చగొట్టి ఇబ్బందులు పెట్టడం మానుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమనేత తాండ్ర వీరేందర్‌రెడ్డి మృతి



తాండ్ర వీరేందర్‌రెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

కేశంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమ నేత, షాద్‌నగర్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తాండ్ర వీరేందర్‌రెడ్డి(85) అనారోగ్యంతో చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడకు చెందిన వీరేందర్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో క్రియాశీల పాత్ర పోషించారు. గ్రామ సర్పంచ్‌గా 20ఏండ్లు సేవలందించారు. విద్యాభివృద్ధికి కృషిచేశారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసిన ఆయన నియోజనవర్గంలో స్పాంజ్ అండ్ ఐరన్ పరిశ్రమల ఏర్పాటుకు వ్యతిరేకంగా హైకోర్టులో పిల్ వేసి గెలిచారు. ఇటీవలే ఈ తీర్పు వెలువడింది. షాద్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాదుల సమస్యలను పరిష్కరించారు. వీరేందర్ రెడ్డి సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందతూ మృతి చెందాడు. షాద్‌నగర్ ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య, ప్రతాప్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, షాద్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్ నరేందర్‌చారి, ఏఎంపీ వైస్‌ఛైర్మన్ బాబర్ ఖాన్, రామకృష్ణారెడ్డి, వంకాయల నారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు వీరేందర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులు అర్పించారు. ఆయన కుమారుడు శ్రవణ్‌రెడ్డి అంత్యక్రియలు పూర్తి చేశారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నాలాలు, ప్రభుత్వ భూములను అక్రమించి చేపడుతున్న నిర్మాణలపై చర్యలు తీసుకోవాలని పోచారం మున్సిపల్ వైస్‌ఛైర్మన్ నానావత్ రెడ్డియానాయక్, కౌన్సిలర్ చింతల రాజశేఖర్ మేడ్చల్ కలెక్టర్, హైడ్రా కమిషనర్‌కు సోమవారం వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. పోచారంలోని సర్వేనెంబర్ 27లోని ప్రభుత్వ స్థలంలో నాలాలను పూడ్చి రాంకీసంస్థ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అదేవిధంగా యంనంపేట్ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్లు 92, 93, 94, 95, 123/పి, 124/పినుండి బొంతకుంట వాగు వరకు ఉన్న నాలాను పూర్తిగా మూసివేసి దాని స్థానంలో 40అడుగుల రోడ్డును నిర్మిస్తున్నారని తెలిపారు. యంనంపేట్‌లోని సర్వేనెంబర్ 90పార్టులో పార్కుస్థలాన్ని అక్రమించి రియల్ వ్యాపారులు రోడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రెడ్డియా నాయక్, రాజశేఖర్‌లు ఉన్నతాధికారులను కోరారు.

విద్యుత్ అధికారులకు సన్మానం



నూతన అధికారులను సన్మానిస్తున్న రైతు సంఘం నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా సహ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మండల కో-ఆర్డినేటర్ తిప్పని పెంటారెడ్డి కోరారు. సోమవారం సంఘ్ ఆధ్వర్యంలో చేవెళ్లలో ట్రాన్స్‌కో ఏడీఏ రాజేష్ బాబు, ఏఈ రాజేందర్‌లను సన్మానించారు. వారు మాట్లాడుతూ.. సాగు కోసం వేసిన విద్యుత్ లైన్లలో ఇబ్బందులను తీర్చాలని కోరారు. ఓవర్ లోడ్ ఉన్న ప్రాంతాల్లో నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లైన్లు పాతబడిన చోట కొత్తగా వేస్తూ కిందికి వేలాడుతున్న వైర్లను లాగి అదనంగా పోళ్లు వేయాలని విన్నవించారు. ఏడీఏ స్పందిస్తూ.. విద్యుత్ పంపిణలో తలత్తే సమస్యలను తమ దృష్టికితెస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

కార్యదర్శులకు టార్గెట్‌లు విధించొద్దు



ఇన్‌చార్జి ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయితీ కార్యదర్శులు

శంకర్‌పల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో పంచాయతీ కార్యదర్శులను బాధ్యులను చేయొద్దని కార్యదర్శులు ఎల్లయ్య, శ్రీకాంత్‌గౌడ్, శ్రీనివాస్, రియాజుద్దీన్ అన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికలో టార్గెట్‌లు విధించకుండా, పనిలో సెలవుదినాలను మినహాయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో గిరిరాజ్‌కు సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి బాధ్యత పంచాయతీ కార్యదర్శులకు అప్పగించొద్దన్నారు. తామే కేటాయిస్తే గ్రామస్తులతో ఇబ్బందులెదురయ్యే ఆస్కారం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అప్పగించిన పనిచేస్తామని, టార్గెట్‌లు, పనిఒత్తిడి పెట్టొద్దని కోరారు. కార్యక్రమంలో పీఎస్‌లు నరహరి, వసంత, ప్రమీల, హరికృష్ణ ఉన్నారు.

రాజమండ్రి నృత్య ప్రదర్శనలో వికారాబాద్ విద్యార్థులు

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజమండ్రిలో నిర్వహించిన నృత్యప్రదర్శన పోటీల్లో వికారాబాద్ బాల కేంద్రం విద్యార్థులు పాల్గొన్నారు. 7, 8వ తేదీల్లో కొనసాగిన ఈ పోటీల్లో వికారాబాద్ విద్యార్థులు బాల కేంద్రం నృత్య శిక్షకురాలు అనురాధ నేతృత్వంలో పాల్గొని ప్రతిభను కనబర్చారు. వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ నృత్యప్రదర్శనలో వికారాబాద్ విద్యార్థులు భవ్యప్రియ, వైష్ణవి, పూర్ణచంద్ర, నిత్య, సాయి వినూత్న, సహజ, సాన్వి పాల్గొన్నారు.



రాజమండ్రి నృత్య ప్రదర్శనలో వికారాబాద్ విద్యార్థులు

బ్రహ్మోత్సవాలకు ముస్తాబు

- 12 నుంచి శ్రీ లక్ష్మీవేంటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు
- ఆరు రోజుల పాటు నిర్వహణ
- 14న తిరు కల్యాణం, 15న రథోత్సవం



లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం, స్వామివార్ల మూలవిరాట్

తలకొండపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న తలకొండపల్లి మండలం రాంపూర్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. దశాబ్దాల చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో ప్రతి ఏటా వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 12 నుంచి 17వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. చరిత్ర కలిగిన ఈ దేవాలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. ఆరు రోజుల పాటు ఇక్కడ జాతర ఘనంగా కొనసాగుతోంది. బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ కార్యనిర్వహణ అధికారి స్నేహలత, ఛైర్మన్ జిల్లెల్ల పవన్ కుమార్ రెడ్డి వివరించారు. 12న అంకురారోహణం, 13న ధ్వజారోహణం, 14న తిరుకల్యాణం, అన్నదానం, 15న భజన పోటీలు, రథోత్సవం, 16న దోపోత్సవం, బండ్లు తిరుగుట 17న చక్రతీర్థం, గరుడ సేవ, నాగబలి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా 13న నిర్వహించే భజన పోటీలలో విజేతలకు మొదటి బహుమతి, రూ.10,116, రెండో బహుమతి రూ.5116, మూడో బహుమతి రూ.2516 అందజేయడం జరుగుతుందని తెలిపారు.

అంతర్జాతీయ కరాటే పోటీలలో ఆమనగల్లు విద్యార్థినుల ప్రతిభ



ఆమనగల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కరాటే పోటీలలో ఆమనగల్లు పట్టణానికి చెందిన సోను కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చాంపియన్ షిప్‌తో పాటు గోల్డ్ మెడల్ సాధించారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో సోమవారం అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఆమనగల్లు సోను అకాడమీ నుంచి 14 మంది విద్యార్థినులు ఈ పోటీలలో పాల్గొన్నారు. అందులో 11 మంది బంగారు, ముగ్గురు సిల్వర్ మెడల్స్ సాధించారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు. పతకాలు సాధించిన ప్రణవి, దీక్షిత, స్రవంతి, పింకి, అరుణ, ఆస్మిక, హిందు, పల్లవి, గాయత్రి, నిహారిక, జస్విక, వైశాలి, అశ్వినిలను పలువురు సత్కరించి అభినందించారు.

తీగాపూర్‌లో ఆలయ ప్రతిష్ఠ వేడుకలు



కొత్తూర్, డిసెంబరు 9:(ఆంధ్రజ్యోతి): తీగాపూర్ నిర్మించిన సీతారామచంద్ర, పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠా వేడకలో భాగంగా మొదటి రోజు సోమవారం జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామిజీ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పరమానందస్వామి ఆశ్రమ పీఠాధిపతులు లక్ష్మీనారాయణ మళయాళస్వామి, వైదిక పురోహితులు, చండిఉపాసకులు రేవల్లి రాజుశర్మ హాజరై పూజల్లో పాల్గొన్నారు. జలాధివాస కార్యక్రమంలో మహిళలు బిందెలతో నీటిని తెచ్చి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బి.జగన్మోహన్‌రెడ్డి, నాయకులు రమాదేవిరమేష్, చిర్ర మల్లయ్య, గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, మెండె కృష్ణ, గోపాల్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభులింగం పాల్గొన్నారు.

వంట.. ఎన్నాళ్లీ తంటా!

(5వ పేజీ తరువాయి)

విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి మంజూరైన కిచెన్ షెడ్ల నిర్మాణాలను పూర్తి చేయడమే కాకుండా గ్యాస్ సౌకర్యం కల్పించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు. రంగారెడ్డి జిల్లాలో 27 మండలాల్లో మొత్తం 1,309 పాఠశాలలున్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలు 882, ప్రాథమికోన్నత పాఠశాలలు 179, ఉన్న పాఠశాలలు 248 ఉన్నాయి. జిల్లాలో 735 పాఠశాలల్లో కిచెన్ షెడ్లు అందుబాటులో ఉన్నాయి. మిగితా పాఠశాలలకు కిచెన్ షెడ్లు లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అప్పటి ప్రభుత్వం (2018-19) గ్రామీణ ప్రాంతంలో 287 కిచెన్ షెడ్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణాలు డీఆర్‌డీఏకు అప్పగించారు. అర్బన్ ప్రాంతాల్లో 86 కిచెన్ షెడ్లు మంజూరు చేయగా వీటి నిర్మాణాలను అర్బన్ ఏరియా టీఎస్‌ఈడబ్ల్యుఐడీసీకి అప్పగించారు. గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన 287 కిచెన్ షెడ్లకు గాను ఇప్పటి వరకు కేవలం 14 మాత్రమే గ్రౌండ్ లెవల్‌కు చేరుకున్నాయి. ఐదు కిచెన్ షెడ్లు బేస్‌మెంట్ స్థాయిలోనే ఉన్నాయి. 24 కిచెన్ షెడ్లు లెంటల్ లెవల్‌కు చేరుకోగా, 15 షెడ్లు స్లాబ్ స్థాయిలో ఉన్నాయి. మొత్తం 45 కిచెన్ షెడ్లు మాత్రమే పూర్తయ్యాయి. 184 కిచెన్ షెడ్లు నిర్మాణ పనులు ఇప్పటి వరకు ప్రారంభించనే లేదు. అర్బన్ ప్రాంతాల్లో మంజూరైన 86 కిచెన్ షెడ్ల నిర్మాణాల్లో కొన్నింటిని పూర్తి చేయగా అత్యధికంగా నిర్మాణాలు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. కేశంపేట మండల పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ప్రత్యేక వంట గది లేకపోవడం వల్ల పాఠశాల వెనుక భాగంలో ఉన్న ఇరుకైన గదిలో వంట చేస్తున్నారు. ఆరుబయట వంటతో ఇబ్బందులు పడుతున్నారు. చౌదరిగూడ, నందిగామ, ఫరూఖ్‌నగర్ మండలాల్లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతుంది. శంకర్‌పల్లి మండలం ఎర్వగూడ పాఠశాలలో సిలిండర్ లేక పోవడంతో కట్టెల పొయ్యిపైనే భోజనం వండి పెడుతున్నారు. మహేశ్వరం మండలం తుమ్మలూరు బడిలో గ్యాస్ సిలిండర్‌కు ఖర్చు ఎక్కువవుతుందని కట్టెల పొయ్యిమీదే వంట చేస్తున్నారు. మంచాల జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమిక పాఠశాలలో కిచెన్‌లో సరిపడా స్థలం లేక కట్టెలు సైతం అందులోనే నిల్వ ఉంచుకోవాల్సిన పరిస్థితి ఉంది. కిచెన్ పైకప్పు శిథిలావస్థకు చేరి వర్షం పడితే కురిసి వంట సామగ్రి తడిసి పోతుంది.



కొందుర్గు వరండాలో మధ్యాహ్న భోజనం వంట

రంగారెడ్డి జిల్లాలోని పాఠశాలల వివరాలు

మండలాలు	27
ప్రాథమిక	882
ప్రాథమికోన్నత	179
ఉన్నత	248
మొత్తం	1,309

కిచెన్ షెడ్ ఇరుకుగా ఉంది..



కిచెన్ షెడ్ ఇరుకుగా ఉంది. వర్షానికి కట్టెలు తడుస్తాయని ఉన్నదాంట్లోనే వాటిని పెట్టాల్సి వస్తుంది. గ్యాస్ సరఫరా చేస్తే కట్టెల పొయ్యి బాధ తప్పుతుంది. మా మండలంలో చాలా పాఠశాలల్లో కిచెన్ షెడ్లు లేక మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు.

- చోటుమియా, వంట కార్మికుడు, చౌదరిగూడ

మార్కెట్ ప్రధాన రోడ్డు ఆక్రమణల తొలగింపు

- మున్సిపల్ అధికారులతో భవన యజమానుల వాగ్వాదం



నిర్మాణాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని మార్కెట్ ప్రధాన రోడ్డు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు సోమవారం తొలగించారు. ఆక్రమణలు తొలగించే సమయంలో పలువురు దుకాణాల యజమానులు మున్సిపల్ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ఆక్రమణలు చేసిన వారిని వదిలేసి సెట్‌బ్యాక్‌తో నిర్మించుకున్న వారి కట్టడాలను తొలగించటంపట్ల కొందరు యజమానులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మున్సిపల్ సిబ్బందిని అడ్డుకోవడంతో స్వల్పంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. పోలీసులు జోక్యం చేసుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డు మూసివేత

మేడ్చల్ హౌజింగ్‌బోర్డు కాలనీ డ్రైనేజీ నిర్మాణపనుల్లో భాగంగా మున్సిపల్ అధికారులు జాతీయ రహదారి వివేకానంద చౌరస్తా నుంచి హౌజింగ్‌బోర్డు మీదుగా రైల్వేస్టేషన్ వెళ్లే రోడ్డును సోమవారం మూసివేశారు. రైల్వే స్టేషన్ వెళ్లాల్సిన వాహనాలను వివేకానంద చౌరస్తా నుంచి ప్రధాన మార్కెట్ పాత జాతీయ రహదారి మీదుగా మహవీర్ చౌరస్తా నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకునే వీలుకల్పించారు. ఇందులో భాగంగా పోలీసులు, మున్సిపల్ అధికారులు ప్రధాన మార్కెట్ రోడ్డుపై ప్రయాణించే వాహనాలకు ఇబ్బందులు కలగకుండా రోడ్డు విస్తరణ చేపట్టి దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న ఆక్రమణలు తొలగించారు. మార్కెట్‌లోని కొందరు భవనాల యజమానులు రోడ్డుకు ఆనుకుని మెట్లపై అంతస్తులకు సంబంధించిన ఐరన్ మెట్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటితో పాటు రోడ్డుపై వాహనాల రాక పోకలకు ఆటంకాలు కల్పించేలా బోర్డులు, వాహనాల పార్కింగ్ షెడ్‌లను ఏర్పాటు చేసుకోగా మున్సిపల్ సిబ్బంది వాటిని తొలగించారు. రోడ్డుపై వాహనాల రాకపోకలకు అడ్డంకులు కల్పిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు.

39వ రోజుకు చేరిన రిలే దీక్షలు



దీక్షలో కూర్చున్న జేఏసీ నాయకులు

తలకొండపల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలంగా ఏర్పాటు కోసం గ్రామస్థులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 39వ రోజుకు చేరాయి. గ్రామంలో సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. 9పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని ప్రభుత్వం మండలం చేయాలని జేఏసీ నాయకులు కోరారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఈ విషయంలో చొరవతీసుకోవాలన్నారు. దీక్షలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్‌లు శరత్‌చంద్ర, అంజనేయులు, నాయకులు బాలయ్య, రామచంద్రయ్య, చెన్నయ్య, కృష్ణయ్య, బాలయ్య, శేఖర్, అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి



ధాన్యం విక్రయాలను పరిశీలిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ వై.గీతనర్సింహ

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. వర్షాలొస్తే ధాన్యం తడువకుండ కప్పేందుకు రైతులకు టార్పాలిన్లు ఇవ్వాలని కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు కేంద్రాన్ని సోమవారం గీత సందర్శించారు. రైతులతో మాట్లాడారు. తుకాలు సకాలంలో వేయక ఇబ్బందులు పడుతున్నామని, వానొస్తే వడ్లు తడుస్తాయని రైతులు అన్నారు. ఎండ కొట్టనందుకు వల్లు వడ్లు ఎండడం లేదని, తేమ శాతం విషయంలో సడలింపునివ్వాలని రైతులు గీతను కోరారు. రైతుల ఇబ్బందులు తీర్చాలని మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, సూపర్‌వైజర్ రాజేశ్వరికి ఆమె సూచించారు. కార్యక్రమంలో కర్నాటి శ్రీధర్‌రెడ్డి, షాబుద్దీన్, కండె సాయి, ఏఈవోలు, మార్కెట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్‌రెడ్డి

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని లయన్స్‌క్లబ్ జిల్లా వైస్‌గవర్నర్ మహేంద్రకుమార్ రెడ్డి, మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. కడ్తాల బస్టాండ్ వద్ద సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆస్పత్రి చైర్మన్ దామోదర్‌రెడ్డి కూతురు ప్రార్థనరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వైనర్సింహ, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్‌లతో మహేంద్రకుమార్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పి.లక్ష్మారెడ్డి, సభ్యులు అంజయ్య, పాష, మిట్టపల్లి అంజయ్య, గంప శ్రీను, జూలూరి రమేశ్, మహేశ్, కుమార్‌గౌడ్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంపాక్ట్ సమ్మిట్‌కు వెళ్లిన సుంకిరెడ్డి



యువ ఆవిష్కర్తలతో సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరుగుతున్న 8వ యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి సోమవారం బయలుదేరి వెళ్లారు. తెలంగాణకు చెందిన ఐదుగురు యువ ఆవిష్కర్తల బృందంతో సుంకిరెడ్డి శంషాబాద్ ఎయిర్‌పోర్టు బయల్దేరారు. ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగే సమ్మిట్‌కు రాష్ట్రం తరపున టాస్క్ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు.

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పనులను ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాసంఘాల నాయకులు

చౌదరిగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను ప్రారంభించి వ్యవసాయానికి నీరందించాలని తెలంగాణ ఉద్యమకారుడు రామన్న మాదిగ అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు నిర్మిత ప్రాంతాన్ని ఉద్యమకారులు, ప్రజాసంఘాల నాయకులు సందర్శించారు. వారు మాట్లాడుతూ పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మిస్తే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. తాగునీటి సమస్యా తీరుతుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వాసిగా పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ పనులను ఎందుకు ప్రారంభించడం ప్రశ్నించారు. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం చేపట్టే ఏ కార్యక్రమానికైనా తెలంగాణ ఉద్యమ వేదిక మద్దతిస్తుందన్నారు. గత పదేళ్లలో ఉద్యమకారులకు సరైన ఆదరణ లేకుండా పోయిందని, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఉద్యమకారుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యమకారుల పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సునిల్, నరింహులు, సాయన్న, శ్రీను, రాములు, వెంకటయ్య, భీంచంద్రం, మొగులయ్య, రాధాకృష్ణ, మహిళలు, వెంకటమ్మ, యాదమ్మ, భీమమ్మ, సత్యమ్మ, ఎల్లమ్మ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మా భూములను ఇతరులకు పట్టా ఎలా చేశారు?

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట అగర్‌మియాగూడ రైతుల ఆందోళన



కందుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అగర్‌మియాగూడ రైతులు

కందుకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మా భూములను ఇతరులకు ఎలా పట్టా చేశారని రంగారెడ్డి జిల్లా అగర్‌మియాగూడ గ్రామ రైతులు సోమవారం సాయంత్రం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. న్యాయం చేయాలని కొందరు రైతులు ఒంటిపై పెట్రోల్ పోసుకోవడానికి ప్రయత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కందుకూరు మండలంలోని లేమూరు రెవెన్యూ పరిధిలోని 246 లో 19ఎకరాల 10గుంటల భూమిని 50ఏళ్ల క్రితం ఉస్మాన్ మోహినుద్దీన్ వద్ద రైతులు భూమిని కొనుగోలు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు పొందారు. అప్పటి నుంచి ఆ భూమిని సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కానీ ఈ భూమి మాదని చిన్నగళ్ల రామయ్య, ఆయన కుమారులు రక్షిత కౌలుదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ వివాదంపై న్యాయస్థానంలో కేసు నడుస్తుండగానే ఈ భూమి కొనుగోలు చేసిన రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కందుకూరు తహసీల్దార్ కార్యాలయం నుంచి కౌలుదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారు. ఇలా ఎలా ఇస్తారని రైతులు ఆందోళనకు దిగారు. భూములు కోల్పోయి మేం ఎలా బతకాలని ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకోవడానికి ప్రయత్నించారు. దీంతో ఎస్ఐ సైదులు తమ సిబ్బందితో వారిని అదుపులోకి తీసుకొని శాంతింపజేశారు. ఈ భూములు మావేనంటూ రైతులు అంతకు ముందు ఆర్డీవో కార్యాలయంలో కూడా దరఖాస్తు చేశారు. ధరణి పోర్టల్‌లో ఒరిజినల్ ఎంట్రీలను పునరుద్ధరించాలంటూ రైతులు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులు హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

రెండో అంతస్తు నుంచి పడి విద్యార్థినికి గాయాలు

- ఎస్టీ బాలికల హాస్టల్‌లో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి



ఉస్మానియాలో చికిత్స పొందుతున్న పూజ

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ హాస్టల్ రెండో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు ఓ విద్యార్థిని పడి తీవ్ర గాయాలైన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని హాజీపల్లి రోడ్డులో ప్రభుత్వ గిరిజన బాలికల వసతి గృహం ఉంది. శుక్రవారం రాత్రి పూజ అనే డిగ్రీ ఫైనలియర్ విద్యార్థిని ప్రమాదవశత్తు రెండో అంతస్తు నుంచి పడిపోయింది. ప్రమాదంలో విద్యార్థిని కాళ్లు విరిగాయి. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని కోలుకుంటోందని, ప్రాణాపాయం లేదని ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా ఆస్పత్రిలో విద్యార్థినిని ఏఐఎస్ఎఫ్ నాయకుడు ఆకాశ్‌నాయక్ సోమవారం పరామర్శించారు. ఆమెకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను, హాస్టల్ నిర్వాహకులను కోరారు.

కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలు

ఘట్‌కేసర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం 9వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలతోపాటు సోమవారం ఘట్‌కేసర్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో మధ్యాహ్నం వరకు కొందరు వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. ఈ బంద్‌కు మిశ్రమ స్పందన లభించింది. జేఏసీ బంద్‌కు పిలుపునివ్వడంతో పాటు కాంగ్రెస్ నాయకుల వంతెన పర్యటన చేపట్టడంతో ఘట్‌కేసర్‌లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మాల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి పర్యటించి బందోబస్తును పర్యవేక్షించారు. కాంట్రాక్టర్‌ను పిలిచి పనులు చేయాలని సూచించడంతో ఆయన పనులు చేపడతామని చెప్పారు. అయినప్పటికీ దీక్షలు కొనసాగుతాయని నిర్వాహకులు స్పష్టం చేశారు.

ఆశా కార్యకర్తలపై పోలీసుల తీరు దుర్మార్గం

వికారాబాద్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారానికి శాంతియుతంగా ఆందోళనచేస్తున్న ఆశావర్కర్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యవహరించిన తీరు దారుణంగా ఉందని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య, తెలంగాణ గ్రామీణ ఆరోగ్య (ఆశ) కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి అనిత ఆరోపించారు. ఆమె సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ.. తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు రోజే కాంగ్రెస్ ప్రభుత్వం, పోలీసులు ఆడవాళ్లని కూడా చూడకుండా దుర్మార్గంగా వ్యవహరించారని, మహిళల పట్ల వెకిలిచేష్టలు చేస్తూ అసభ్యకరంగా వ్యవహరించారని ఆరోపించారు. పోలీసుల వైఖరి ఇదే విధంగా కొనసాగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల

పీసీసీ చీఫ్‌ను కలిసిన రాజేశ్

ఆమనగల్లు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్‌ను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అభినందించారు. సోమవారం రాజేశ్ హైదరాబాద్‌లోని మహేశ్‌కుమార్‌గౌడ్ నివాసంలో కలిసి సత్కరించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన రాజేశ్‌ను పీసీసీ చీఫ్ అభినందించి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు.


రాజేశ్‌ను సన్మానిస్తున్న మహేశ్‌కుమార్‌గౌడ్

మల్లేష్‌కు నాయకుల పరామర్శ

షాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో నగరంలో ఓ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికొచ్చిన ప్యాక్స్ వైస్‌చైర్మన్ మల్లేష్‌ను సోమవారం కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీసతీష్, బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణ, కురుమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, పాండు, శ్రీనివాస్, శివకుమార్‌లు పరామర్శించారు.

నిరుపేదల్లో సొంతింటి ఆశలు

- ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వనున్న రాష్ట్ర ప్రభుత్వం


కుర్మిద్దలో శిథిలమవుతున్న కిష్టయ్య ఇల్లు

యాచారం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వం గూడులేని నిరుపేదలకు మొదటి ప్రాధాన్యంగా ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించడంతో పేదల్లో ఆశలు చిగురించాయి. ఇల్లు లేని వారు పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. దరఖాస్తులను సెక్రటరీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా జి-మెయిల్ ఖాతా తెరిచారు. మండలంలో 24పంచాయతీల్లో 120మందితో ఇందిరమ్మ కమిటీలు వేశారు. ఈ కమిటీ సిఫారసు మేరకు నిజమైన అర్హులకు ఇండ్లు మంజూరు చేస్తారు. ఇల్లు మంజూరికి ఇంటిస్థలం తమదేనని తెలిపే పత్రం, స్థలం ఎన్ని గజాలుందో వివరాలతో డాక్యుమెంట్‌ను కార్యదర్శులకు అందజేయాలని అధికారులు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కొన్నిచోట్ల డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టి కొందరికి పంచారు తప్ప గ్రామాల్లో ఒక్క నిరుపేదకు కూడా వేరేగా ఇల్లు కట్టివ్వలేదు. 9 ఏళ్ల క్రితం తక్కళ్లపల్లి సమీపంలో డబుల్ బెడ్‌రూం ఇళ్లకు నాటి మంత్రి పి.మహేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. పిల్లర్లకు స్టీలు వేసి వదిలేశారు.

ఖాళీ స్థలం ఉన్నవారికే మొదట అవకాశం

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో మొదట ఖాళీ స్థలం ఉండి, ఇల్లులేని నిరుపేదలకే అవకాశం ఇవ్వాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన ఆదేశాలు ఇచ్చింది. వీటిలో పైరవీలకు, రాజకీయాలకు తావులేదని పేర్కొంది. మహిళ పేరిటే దరఖాస్తులు స్వీకరిస్తారు. తెల్లరేషన్‌కార్డు ఉన్నవారే దరఖాస్తు చేసుకోవాలి. ఎస్సీ, ఎస్టీలకు 30శాతం, దివ్యాంగులకు 5శాతం, బీసీ, మైనార్టీలకు 50శాతం, మిగతా జనరల్‌కు కేటాయిస్తారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికిచ్చే రూ.5లక్షల్లో పునాదిస్థాయిలో రూ.లక్ష, పిల్లర్ల దశలో 1.25లక్షలు, స్లాబ్‌కు 1.75లక్షలు, ఫినిషింగ్‌కు రూ.లక్ష చొప్పున అందజేస్తారు.

ఏళ్లుగా శిథిలమైన పెంకుటింట్లో ఉంటున్నా



మా పెంకుటిల్లు గత 40ఏళ్ల క్రితం కట్టించాం. వానొస్తే ఇల్లంతా ఉరుస్తుంది. ఎందరో అధికారులకు, నాయకులకు మా గోడు చెప్పినా నాకు ఇల్లు మంజూరు చేయలేదు. ఇప్పటి ప్రభుత్వమైనా నాకు ఇల్లు మంజూరు చేసి ఆదుకుంటే వారి మేలు మరువలేను. వర్షమొస్తే ఇల్లు ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదు. కలెక్టర్ నాకు ఇల్లు మంజూరు చేయాలి.

- ఢిల్లీ కిష్టయ్య, కుర్మిద్ద

నిరుపేద దివ్యాంగుడిని.. ఇల్లు మంజూరు చేయాలి



మాది నిరుపేద కుటుంబం. ఇల్లు ఇరుకుగా ఉండడంతో అద్దె ఇంట్లో ఉంటున్నా. నా ఇద్దరు తమ్ముళ్లు పాతింట్లో ఉంటున్నారు. దివ్యాంగుడనైన నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి. అధికారులు విచారణ చేసి మా కుటుంబానికి న్యాయం చేయాలి. నాకు, నా తమ్ముళ్లకు ఇళ్లు మంజూరు చేయాలి

- రవీందర్, దివ్యాంగుడు, నజ్దిక్‌సింగారం

క్రైం కార్నర్

ఆభరణాలు ఎత్తుకెళ్లిన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, డీఐ రమేష్‌నాయుడు

షాబాద్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : మహిళ మెడలోని బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లిన కేసులో నిందితుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, చేవెళ్ల డీఐ రమేష్ నాయుడు తెలిపిన వివరాల మేరకు.. కొందుర్గు మండలానికి చెందిన కావలి లక్ష్మి ఈ నెల 4న గ్రామ బస్‌స్టాండ్ వద్ద నిలబడింది. అదే గ్రామానికి చెందిన కుశలయ్య అక్కడే ఉన్నాడు. ఎలికట్టకు చెందిన జక్కుల శివలింగం బైక్‌పై అక్కడి నుంచి వెళ్తున్నాడు. కుశలయ్య తనను సమీపంలో ఉన్న కంపెనీ వద్ద దించాల్సిందిగా శివలింగాన్ని కోరాడు. లక్ష్మి కూడా తనను బైక్‌పై ఎక్కించుకోవాలని కోరడంతో ఆమెను కూడా శివలింగం బైక్‌పై ఎక్కించుకున్నాడు. కుశలయ్య దిగిపోగానే లక్ష్మిని ముద్దెంగూడలో దింపేందుకు బయలుదేరాడు. షాబాద్ సమీపంలోకి రాగానే, ఆమెను రోడ్డు పక్కకు తోసేసి మెడలోని బంగారు గుండ్లను తెంచుకొని పారిపోయాడు. మరుసటిరోజు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులకు శివలింగం 8వ తేదీ ఆదివారం సాయంత్రం సర్దార్‌నగర్‌లో టీ స్టాల్ వద్ద కనిపించాడు. పోలీసులు అతడిని అరెస్టు చేసి దొంగిలించిన బంగారం, బైక్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని సోమవారం రిమాండ్‌కు తరలించారు.

చౌదరిగూడలో స్వయం పాలన

చౌదరిగూడ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో స్వయం పాలన దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి, పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం సునీత, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



తలకొండపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధి వెల్జాలకు చెందిన చెన్నంపల్లి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. ఆమె కుటుంబాన్ని సోమవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.3వేలసాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు పెంటయ్య, యాదయ్య, శ్రీకాంత్, అభిలాష్, పరంధాములు, జగన్, రవి ఉన్నారు. అలాగే మృతురాలి కుటుంబానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి రూ.3వేలు, జిల్లా నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి రూ.4వేలు, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి రూ.2వేలు, ప్యాక్స్ మాజీ డైరెక్టర్ కృష్ణయ్యగౌడ్ వెయ్యి అందజేశారు. అంబాజీ, అబ్బాస్, కృష్ణయ్య, రవీందర్, శ్రీనివాసులు, నారాయణ, లక్ష్మణ్, లచ్చయ్య, తదితరులు ఉన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు


షాద్‌నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సోనియాగాంధీ జన్మదిన వేడుక కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, నాయకులు

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి/షాద్‌నగర్ రూరల్/యాచారం/కేశంపేట/చేవెళ్ల/మాడ్గుల/కొత్తూర్/షాద్‌నగర్/కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 60ఏండ్లు కొట్లాడిని 4కోట్ల తెలంగాణ ప్రజల స్వరాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసిన ఘనత కాంగ్రెస్ సీనియర్ నేత సోనియాగాంధీకే దక్కిందని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులో సోమవారం సోనియాగాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. రాజీవ్ చౌక్‌వద్ద మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్‌చేసి ప్రజలకు పంచారు. సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు ధనుంజయ, వస్పుల శ్రీశైలం, కృష్ణనాయక్, టి.రామకృష్ణ, ఎ.శ్రీను, కె.మల్లయ్య, కె.శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సురేశ్‌నాయక్, వెంకట్‌రెడ్డి, పర్వతాలు, ఖలీల్, ఫరీద్, మహేశ్, ఖాదర్, ఖాద్రి, బాబ, అలీం, నాజర్, మైసయ్య, గిరి, రఫీ, షాబుద్దీన్, పరమేశ్ పాల్గొన్నారు. కడ్తాలలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పార్టీ మండల అధ్యక్షుడు బిచ్యానాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, మార్కెట్ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, వెంకటేశ్, లక్ష్మయ్య, యాదయ్య, బాల్‌రాజ్, రాజేశ్, నరేశ్, బ్రహ్మచారి, సత్యం, జహంగీర్‌అలీ, లక్ష్మణ్, జవహర్‌లాల్, ఎక్బాల్‌పాషా, హీరాసింగ్, అస్లర్ అలీ, సత్తయ్య, జంగయ్య, బి.రవి, ఇమ్రాన్‌బాబ, మల్లేశ్, భానుకిరణ్, శ్రీకాంత్, విజయ్‌రాథోడ్, రమేశ్, చందు, సాయి, శ్రీశైలం, లక్‌పతినాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు. తలకొండపల్లలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నిర్వహించారు. మోహన్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, అంజయ్య, రవీందర్, అజీం, డిగ్రీ కృష్ణ, రమేశ్, ఆరిఫ్, చెన్నకేశవులు, నరేశ్, జనార్దన్‌రెడ్డి, డేవిడ్, రాములు, శ్రీశైలం, హరిమోహన్‌రెడ్డి, శ్రవణ్‌రెడ్డి, అనిల్, కృష్ణారెడ్డి, శంకర్, రాజేందర్, వెంకటేశ్, ప్రవీణ్‌రెడ్డి, అనిల్ పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండల గ్రామాల్లో జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఎలికట్టలో నాయకులు మల్లయ్య, కావలి శ్రీశైలం, నర్సింహ, యాదయ్య, పోచయ్య, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. యాచారం కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచారు. మంఖాల దాసు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ, అక్బర్, రాకేష్‌కుమార్, వెంకటరెడ్డి, రాంరెడ్డి, మురళి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. కేశంపేటలో పార్టీ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్ సోనియగాంధీ చిత్రపటానికి పూలమాల వేశారు. తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియాగాంధీదే అని డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి అన్నారు. చేవెళ్లలోని కాంగ్రెస్ కార్యాలయంలో నాయకులతో కలిసి కేక్ కట్‌చేశారు. మాడ్గులలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. పంచాయతీ ఆఫీసు రేవంత్‌రెడ్డి మిత్రమండలి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. మిద్దె రాములు, విష్ణు, వెంకటయ్య, శ్రీనివాస్, భాస్కర్, సూదిని గోవింద్‌రెడ్డి, కె.అంతయ్య, యాదయ్య, ఇబ్రహీం పాల్గొన్నారు. కొత్తూర్‌లో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో సోనియా చిత్రపటానికి పాలాభిషేకం చేసి కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో పార్టీ కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఫరూఖ్‌నగర్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్, తిరుపతిరెడ్డి, రఘునాయక్, ముబారక్, శ్రీనివాస్ పాల్గొన్నారు. పీసీసీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, కందుకూరు మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి, నాయకుడు ఎస్.కృష్ణానాయక్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. సోనియాగాంధీకి తెలంగాణ ప్రజలు రుణపడి ఉన్నారన్నారు. ప్రభాకర్‌రెడ్డి, పాండు, జగన్, సులేమాన్, రాణాప్రతాప్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, డి.శ్రీధర్, జికుమార్, కృష్ణయ్య, సంజీవరెడ్డి పాల్గొన్నారు.


చేవెళ్లలో సోనియాగాంధీ జన్మదిన కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కడ్తాలలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

శ్రద్ధగా చదివి ఉన్నతిలోకి రావాలి

యాచారం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత చదువు చదివి జీవితంలో ఎదగాలని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ సీఐ లిక్కి కృష్ణంరాజు అన్నారు. సోమవారం మేడిపల్లి పాఠశాలలో విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులొచ్చినా తమకు తెలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. టీచర్లు చెప్పే పాఠాలు శ్రద్ధగా విని మంచి మార్కులు సాధించాలన్నారు. నాణ్యమైన భోజనమందకపోతే ఎంఈవోకు లేదా ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై తేజంరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, టీచర్లు ఉన్నారు

మొక్కల పెంపకంలో మెళకువలు పాటించాలి


కవర్లలో మట్టి నింపే విధానాన్ని చూపుతున్న ఏపీడీ చరణ్‌గౌతం

కేశంపేట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నర్సరీల్లో మొక్కల పెంపకంలో మెళకువలు పాటించాలని ఉపాధి హామీ చేవెళ్ల క్లస్టర్ ఏపీడీ చరణ్ గౌతం అన్నారు. అల్వాలలో సోమవారం మొక్కల పెంపకంపై అవగాహన నిర్వహించారు. ఎర్రమట్టిలో పశువుల పేడను కలపాలని సూచించారు. మట్టిని మొత్తగా చేయాలని, అనంతరం పాలిథీన్ కవర్లలో మట్టిని నింపాలని కూలీలకు సూచించారు. టార్గెట్ మేరకు మొక్కలు పెంచాలన్నారు. ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీవో కిష్టయ్య, ఈసీ అజీజ్, టీఏలు నిలకంఠంబాబు, శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

టీయూపీఎస్ ధర్మాగ్రహ దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి టీయూపీఎస్ ఈ నెల 17న హైదరాబాద్‌లో ధర్మాగ్రహ దీక్ష తలపెట్టిందని నాయకులు తెలిపారు. దీక్ష కోసం రూపొందించి పోస్టర్‌ను సోమవారం కడ్తాలలో నాయకులతో కలిసి ఎంఈవో సత్యనారాయణ ఆవిష్కరించారు. టీయూపీఎస్ జిల్లా ప్రముఖ్ సుమరంజిత, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్, మల్లికార్జున్, భాస్కర్, మాధవి పాల్గొన్నారు.

పుష్పశ్రీ ఫ్యాక్టరీ ప్రారంభం


రాజశ్రీతో సమావేశమైన అభిలాష్ బిస్త్, సీపీ సుధీర్‌బాబు తదితరులు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నంలోని వైట్ గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్ టెక్స్ పార్కులో సోమవారం పుష్పశ్రీ ఫ్యాక్టరీని ఆదిత్య బిర్లా గ్రూప్ వైస్ చైర్మన్ రాజశ్రీ ప్రారంభించారు. కార్యక్రమంలో తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్‌బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు పాల్గొన్నారు. రాచకొండ కమిషనరేట్‌లోని భౌగోళిక పరిస్థితులు, నేరాల నియంత్రణ వివరాలను, షీ టీమ్స్ పనితీరును సీపీ సుధీర్‌బాబు రాజశ్రీకి వివరించారు. కమిషనర్ కోరిక మేరకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ కింద సీసీటీవీల నిర్వహణ, ఇతర కార్యక్రమాలకోసం నిధులు ఇస్తామని, అవసరమైన సాంకేతికపరమైన సహకారం అందిస్తామని రాజశ్రీ తెలిపారు.

'బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టాలి'

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అధికారానికి దూరమైన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విషప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆ పార్టీ నేతల కుట్రలు, ఎత్తుగడలు పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లులో సోమవారం బీఆర్ఎస్‌కు చెందిన వస్పుల సామేల్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్య తదితరు కండువా కప్పి కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. నాయకులు కృష్ణనాయక్, మల్లయ్య, ధనుంజయ్య, శ్రీకాంత్, శ్రీశైలం, సాయి, రాజశేఖర్, మహేశ్, షాబుద్దీన్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మైసయ్య, బాబ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ధర్మ సమాజ్ పార్టీ చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం ముగిసింది. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఎదుట చేపట్టిన దీక్షలో పలు డిమాండ్లను చేశారు. పేదలందరికీ ఉచితంగా విద్య, వైద్యాన్ని అందించాలని, ఉపాధి కల్పించాలని, సాగునీటి సౌకర్యంతో ఎకరం భూమిని ఇవ్వాలని, 200గజాల్లో ఇల్లు కట్టివ్వాలని డిమాండ్ చేశారు. దీక్షలో ధర్మ సమాజ్ పార్టీ నాయకులు కె.రాఘవేందర్ ముదిరాజ్, రాకేష్, హైమత్‌పాషా, లాలయ్యముదిరాజ్, నర్సింహులు, రాజు, జయప్రసాద్, చెన్నయ్య రవీందర్, మహిపాల్ పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

తలకొండపల్లి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో తలకొండపల్లిలో ధర్నా చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు రవిగౌడ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం ఇచ్చారు. రవిగౌడ్ మాట్లాడుతూ పట్టాలిచ్చిన వారికి స్థలాలు చూపాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా, మండల నాయకులు పాండు, కుమార్, పద్మఅనిల్, యాదయ్య, హరికాంత్, కుమార్, మహేశ్, వెంకటేశ్, శ్రీశైలం, కుమార్‌గౌడ్, శ్రీను, మహేశ్ పాల్గొన్నారు.

'రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రిదే'

శంకర్‌పల్లి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): రైతులకు రుణమాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీన్‌కుమార్ అన్నారు. సోమవారం నగరంలో నిర్వహించిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మున్సిపల్ సిబ్బంది, డ్వాక్రా మహిళలు, మెప్మా సిబ్బంది, రిసోర్సు పర్సన్లు తరలివెళ్లగా బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజా పాలన విజయోత్సవాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, మేనేజర్ అంజన్‌కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోసు రవి ఆధ్వర్యంలో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చలికాలం నేపథ్యంలో దుప్పట్లు పంపిణీ చేసినట్లు రవి తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిక్యానాయక్, ప్యాక్స్ డైరెక్టర్ వెంకటేశ్, కాంగ్రెస్ నాయకులు సత్యంయాదవ్, బ్రహ్మచారి, యూత్ కాంగ్రెస్ నాయకులు క్యామ రాజేశ్, భానుకిరణ్, విజయ్, ఇమ్రాన్‌బాబ,ఎక్బాల్‌పాషా రమేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

దళపతిగౌడ్‌కు సన్మానం

ఆమనగల్లు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన దళపతిగౌడ్‌కు సోమవారం ఆమనగల్లులో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు పాల్గొన్నారు. దళపతిగౌడ్‌ను మార్కెట్ చైర్‌పర్సన్ గీతనర్సింహ, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనితవిజయ్, ధనుంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఖాదర్‌ఖాద్రీ, కృష్ణ, దశరథం, రాజశేఖర్, ఫరీద్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్, శ్రీశైలం పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించమంటే అరెస్టులా?

చౌదరిగూడ/కేశంపేట/షాద్‌నగర్ రూరల్/కడ్తాల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అప్పు చేసి గ్రామాల్లో పనులు చేస్తే పెండింగ్ బిల్లు లు చెల్లించమంటే అరెస్టు చేయడం ఏమిటని బీజేపీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు, పెద్ద ఎల్కిచర్ల మాజీ సర్పంచ్ భూపాలచారి అన్నారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు బిల్లులు చెల్లించాలని తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లకుండా పోలీసులు గృహ నిర్బంధాలు, అరెస్టులు చేశారు. ప్రభుత్వం సర్పంచుల బకాయిలు చెల్లించి స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. చలో అసెంబ్లీకి వెళ్తున్న కేశంపేట మండల తాజా మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మాజీ సర్పంచ్‌లు కామ్లెకార్ నవీన్‌కుమార్, తలసాని వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, తిరుమల్‌రెడ్డి శ్రీనివాస్‌లను ఎస్ఐ రాజ్‌కుమార్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. తెల్లవారు జామున 4గంటలకు బృందాలుగా గ్రామాలకు చేరుకున్న పోలీసులు మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం 12గంటలకు విడిచి పెట్టారు. అరెస్ట్ అయిన వారిలో కొండన్నగూడ, ఎలికట్ట, చిన్నచిల్కమర్రి, కిషన్‌నగర్ మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, సాయిప్రసాద్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. కడ్తాలకు చెందిన రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐఎస్ సదన్ పోలీసుస్టేషన్‌కు తరలించి సాయంత్రం సొంత పూచీ కత్తుపై విడుదల చేశారు. పెండింగ్ బిల్లులను చెల్లించకుండా ప్రభుత్వం ఏడాదిగా కాలయాపన చేస్తోందని ఆయన ఆరోపించారు. పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వంపై పోరాడుతున్న మాజీ సర్పంచ్‌లను అరెస్ట్ చేయడం తగదని ఆయన పేర్కొన్నారు.

కలగానే మినీ స్టేడియం

(5వ పేజీ తరువాయి)

హామీలకే పరిమితం అవుతుంది. ఇటీవల ఇబ్రహీంపట్నం సమీపంలోని భూదాన్ భూముల్లో స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన కూడా జరిగింది. కానీ నిర్మాణానికి ఒక్క అడుగ కూడా ముందుకు పడలేదు.

కేటాయింపుల విషయానికొస్తే..

ఇక్కడ ఎన్ఎస్‌జీకి 600 ఎకరాలు, ఆక్టోపస్‌కు 570 ఎకరాలు, బీడీఎల్‌కు 370 ఎకరాలు కేటాయించారు. అలాగే వందల ఎకరాల్లో బీఈఎల్, ఎన్ఐఏల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. కళ్యాణి గ్లాస్ క్లస్టర్‌కు స్థలాలు కేటాయించారు. ఆదిబట్ల ఏరోస్పేస్ సెజ్‌లో టీసీఎస్, టాటా అడ్వాన్స్ సిస్టం, టాటా లాకీడ్ మార్టిన్, సికోర్‌స్కై, న్యూకాన్ ఏరోస్పేస్, డెస్మీ, కాగ్నిజెంట్ లాంటి పలు రక్షణ, వైమానిక అంతరిక్షయాన, ఐటీ సంస్థలకు స్థలాలు కేటాయించారు. ఎలిమినేడులో ఏరోస్పేస్ పార్కుకోసం మరో 600 ఎకరాలు సేకరించారు. ఇబ్రహీంపట్నంలో వైట్ గోల్డ్ ఇంటిగ్రేటెడ్ స్పిన్ టెక్స్ పార్కుకు 110 ఎకరాలు కేటాయించగా నూలు, వస్త్ర మిల్లులు కూడా వచ్చాయి. మొత్తానికి ఇక్కడ పది వేల ఎకరాలపైగా అనేక సంస్థలకు కేటాయించారు. ఇవిగాక యాచారం, కందుకూరు, కడ్తాల మండలాల పరిధిలో 30 వేల ఎకరాల్లో ప్రతిష్టాత్మకమైన ఫ్యూచర్ సిటీ ఏర్పాటవుతుంది. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ భూదాన్, అసైన్డ్ భూములు ఉన్నాయి. అయితే స్టేడియం నిర్మాణానికి స్థలం కేటాయించడంలో మాత్రం వెనకముందూ ఆలోచిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

క్రీడలపై చిన్నచూపు

క్రీడలు కూడా చదువుల్లో భాగమైనప్పటికీ ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. పాఠశాల స్థాయినుంచే పిల్లలను క్రీడలపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉంది. అయితే అనేక సర్కారు బడుల్లో మైదానాలు కూడా లేవు. ఉన్నా విద్యార్థులను ఆటలాడించే పీఈటీలు కరువయ్యారు. పాఠశాలలకు కనీసం క్రీడా సామగ్రి కూడా పంపిణీ చేయడం లేదు. ఏదో మొక్కుబడిగా ఏడాదికోసారి జోనల్ స్థాయి క్రీడలు నిర్వహిస్తూ మమ అనిపిస్తున్నారు. ఎవరైనా ఆస్ట్రో టర్ఫ్ మైదానం ఏర్పాటు చేసుకుంటే వారికి ప్రభుత్వం తరపున రాయితీ అందజేస్తామని చెప్పినప్పటికీ అదికూడా అమల్లోకి తేలేకపోతున్నారు.

గురుకుల విద్యాపీఠ్ వేదికగా..

ఇబ్రహీంపట్నంలో మినీ స్టేడియం లేక ప్రైవేటు విద్యాసంస్థ అయిన గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్‌లో జోనల్, రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నారు. గతంలో రాష్ట్రస్థాయిలో ఫుట్‌బాల్, వాలీబాల్, ఆర్చరీ పోటీలు ఇక్కడే నిర్వహించారు. 2019 సెప్టెంబర్‌లో మూడు రోజులపాటు నాలుగో సీనియర్ మహిళల రాష్ట్ర హాకీ టోర్నమెంట్స్ కూడా ఇక్కడే జరిగింది. జోనల్ లెవల్ హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. అంతేగాదు ఎంకేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల కోసం యువతకు శారీరక శిక్షణ కూడా ఇక్కడే ఇచ్చారు.

మినీ స్టేడియం ఏర్పాటు చేయాలి



క్రీడలపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. ఇబ్రహీంపట్నంలో మినీ స్టేడియం లేక క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రోత్సాహం లేక ప్రతిభ మసకబారిపోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో పీఈటీ, పడీల నియామకం చేపట్టాలి. క్రీడా సామగ్రిని కూడా సరఫరా చేయాలి. ప్రతీరోజు గంటపాటు క్రీడలు ఆడించాలి.

- బూడిద రాంరెడ్డి, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్ అన్నారు. సోమవారం లేమూరు వైద్యాధికారికి ఆశాలతో కలిసి వినతి పత్రం ఇచ్చిన అనంతరం మాట్లాడారు. 20సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశా వర్కర్లకు నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. మంగళవారం నగరంలోని ఆరోగ్యశాఖ కమిషనరేట్ ముట్టడి చేస్తామని తెలిపారు. అన్ని గ్రామాల ఆశావర్కర్లు పాల్గొని విజయవంతం చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు సుశీల, సంధ్య, విజయ, రాధిక, జయసుధ, శ్రీలత, ముంతాజ్‌బేగం, అప్రోచ్, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

- **షాబాద్:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నయ్య, నర్సింహులు అన్నారు. షాబాద్‌లో సోనియాగాంధీ జన్మదినాన్ని నిర్వహించారు. కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ ఎంపీటీసీ రవీందర్, నాయకులు సత్యనారాయణ, యాదగిరి,అక్తర్‌పాషా,అస్మత్ పాషా, వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య, సత్యనారాయణ, రామస్వామి, సాజిద్, యాదయ్య, పాల్గొన్నారు.
- **చౌదరిగూడ:** సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీల నిర్వహణకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, రమేష్‌కుమార్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, లక్ష్మీఅనురాధ, ఎంఈవో కిరణ్‌కుమార్ రెడ్డి, గాయిత్రీదేవి, రాజు తదితరులు పాల్గొన్నారు.
- **యాచారం:** విలువైన నగలు ధరించి ఒంటరిగా పొలం పనులకు, విందులకు వెళ్లొద్దని, చైన్‌స్నాచర్‌లు ఉన్నారనే విషయం గమనించాలని యాచారం సీఐ నర్సింహారావు, ఎస్సై మధు అన్నారు. గున్‌గల్‌లో వారు పర్యటించి ప్రజల ఇబ్బందులు తెలుసుకున్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు.
- **మొయినాబాద్ రూరల్:** యువత రాజకీయ లక్షణాలు పెంపొందించుకొని ప్రజాసేవలో రాణించాలని సీఐ పవన్‌రెడ్డి అన్నారు. యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైనా విఘ్నేష్‌రెడ్డి సీఐని కార్యాలయంలో కలిశాడు. సీఐ, ఎస్సై ముజరఫ్ అలీలను సన్మానించాడు. రాజకీయాల్లో అందరిని కలుపుకొని పోవడం, సామాజిక సేవలతో రాజకీయంగా ఎదుగుతారని సీఐ అన్నారు. మహేందర్‌రెడ్డి, జ్ఞానేశ్వర్‌రెడ్డి ఉన్నారు.
- **షాద్‌నగర్ రూరల్:** నషా ముక్త, ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడకం వల్ల యువత జీవితం నిర్వీర్యమవుతుందన్నారు. మత్తు, ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్, రమేష్, వంశీ, కమలాకర్, శివశంకర్‌పాల్గొన్నారు.
- **ఆమనగల్లు:** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని బాగా చదవాలని ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీధర్ అన్నారు. ఆమనగల్లులోని బాలుర పాఠశాలలో మండలస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పోటీల్లో బాలుర, బాలికల స్కూళ్ల విద్యార్థులు, కేజీబీవీ విద్యార్థినులు పాల్గొన్నారు. ఇంగ్లీష్ మీడియంలో బాలికల పాఠశాల విద్యార్థిని శ్రీవల్లి మొదటి స్థానం, బాలుర పాఠశాలకు చెందిన ఎస్.దేవదాస్ రెండో స్థానం, కేజీబీవీకి చెందిన నందిని మూడోస్థానంలో నిలిచారు. తెలుగు మీడియంలో బాలికల పాఠశాల డి.పూజ, బి.పూజ, నీలావతి బహుమతి సాధించారు. టీచర్లు అశోక్‌రెడ్డి, నాగసుందరి, కనకదుర్గ, సుజాత, వెంకటనారాయణ, మాధవి, సుజాత, ఆచారి పాల్గొన్నారు.
- **యాచారం:** సర్వమతాల సారావంశం ఒక్కటేనని, అన్ని మతాలను గౌరవించి దేశఖ్యాతిని ప్రపంచానికి చాటాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి అన్నారు. యాచారంలో క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చర్చిలకు ఎలాంటి వసతులు కావాలన్నా తాను సహకరిస్తానన్నారు. పేదలను ఆదుకున్న మహనీయుడు ఏసు ప్రభువని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదల్ కార్యదర్శి దాసు, మండల అధ్యక్షుడు నర్సింహ, మురళి. సంజీవయ్య ప్రభాకర్ ఉన్నారు.
- **ఆమనగల్లు:** కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేవైఎం జిల్లా కార్యదర్శి వగ్గు ప్రభాకర్, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహులు అన్నారు. పోలెపల్లిలో సోమవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీశైలాన్ని ఎన్నుకున్నారు. నాయకులు శంకరయ్య, రామకృష్ణ, వెంకటేశ్‌గౌడ్, తిరుపతయ్య, వెంకటయ్య, తిరుమలేశ్, సాయితేజ, బాబు పాల్గొన్నారు.
- **కేశంపేట:** ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంలాంటిదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బుర్రి భూపాల్‌రెడ్డి అన్నారు. పోమాల్‌పల్లికి చెందిన శివకుమార్‌కు మంజూరైన రూ.17వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును స్థానిక నాయకులతో కలిసి అందజేశారు.